క్లుప్తంగా

వెంకన్నపాలెంలో వెలిగిన విద్యుత్ దీపాలు



ఎలక్ట్రికల్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ధర్మాల శ్రీను

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధిలో ఏళ్లతరబడి ఉన్న విద్యుత్ దీపాల సమస్యను పరిష్కరించామని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను తెలిపారు. వార్డు పరిధిలోని వెంకన్నపాలెం గ్రామంలో వీధిదీపాల కండక్టర్లు పూర్తిగా దెబ్బ తినడంతో, అవి సక్రమంగా వెలగడం లేదు. ఈ సమస్యను ఏపీఈపీడీసీఎల్ అధికారులకు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన అధికారులు గురువారం కండక్టర్లను మార్చారు. దీంతో వీధి దీపాలు వెలిగాయి. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

'ది స్టోరీ ఆఫ్ బ్యూటీఫుల్ గర్ల్' పోస్టర్ ఆవిష్కరణ

అగనంపూడి: రవిప్రకాష్ దర్శక నిర్మాణంలో రూపొందించిన 'ది స్టోరీ ఆఫ్ బ్యూటీఫుల్ గర్ల్' సినిమా పోస్టర్ ఆవిష్కరణ దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో గురువారం సాయంత్రం నిర్వహించారు. నటులు నిహాల్, కిరణ్ అబ్బవరం, దృషిక చందర్ పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా సినిమా కథను, సందర్భాన్ని వివరించారు. విద్యార్థులతో చిట్‌చాట్ నిర్వహించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, చిత్ర యూనిట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా గర్జనను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

పెదగంట్యాడ: ఈ నెల 30న ఉక్కునగరంలో నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఉక్కు నిర్వాసితులు, కార్మికులు తమ కుటుంబాలతో పాల్గొనాలని కోరారు. పెదగంట్యాడ ఉక్కు కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో ఇంటక్ కార్యనిర్వాహక అధ్యక్షుడు గొందేశి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన అఖిల పక్ష కార్మిక సంఘాలు, రాజకీయ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రజా గర్జనను విజయవంతం చేసేందుకు నిర్వాసిత కాలనీల్లో విస్తృతంగా పాదయాత్రలు చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాటం చేయాలన్నారు. సమావేశంలో నిర్వాసితుల సంఘం కన్వీనర్ గొందేశి సత్యారావు, నెల్లి అప్పలరాజు, ఎల్లేటి శ్రీనివాసరావు, బొడ్డు పైడిరాజు, మంత్రి గోపీనారాయణ, పాల అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలని నిరసన

కూర్మన్నపాలెం: ఇటీవల మృతి చెందిన మొల్లి నాయుడు మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, నిందితులను పట్టుకుని అరెస్ట్ చేయాలని వడ్లపూడి ఎన్టీఆర్‌నగర్, శ్రీరామ్‌నగర్ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు దువ్వాడ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించడంపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. పోలీసులు కూడా ప్రధాన నిందితులను వదిలేసి, ఒక్కరినే అరెస్ట్ చేయడం తగదన్నారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య జరిగిందని, అయితే యాకోబ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. హత్య వెనుక మరికొందరి హస్తం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. హత్యకు కుట్ర పన్నిన నిందితులపై దువ్వాడ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఊరెళ్తున్నారా.. ఇల్లు జాగ్రత్త

- పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇస్తే ప్రత్యేక భద్రత ఏర్పాటు
- ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ఉపయోగకరం
- పోలీసుల సూచనలు



స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్‌ఐ శ్రీనివాసరావు

ఉక్కునగరం: పెద్ద పండగకు ఊళ్లకు వెళ్లేవారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇటీవల ఉక్కునగరంలో వరుస దొంగతనాలు జరిగిన నేపథ్యంలో ఉక్కునగర వాసులు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. సాధారణంగా ఏడాదిలో పెద్ద పండగగా భావించే సంక్రాంతికి ఎక్కువ మంది సొంత ఊళ్లకు వెళ్లడం.. కొత్త అల్లుళ్లు అత్తవారింటికి వెళ్లడం పరిపాటి. వెళ్లేటప్పుడు మూడు, నాలుగు రోజులే కదా తిరిగి వచ్చేస్తామనే ఉద్దేశంతో ఇంట్లో నగదు, బంగారు వస్తువులు వదిలి వెళ్తున్నారు. ఇదే అదనుగా భావించే దొంగలు ఇల్లు దోచేసే అవకాశం ఉంది. ఇటీవల ఉక్కునగరంలో రోజుకు నాలుగైదు క్వార్టర్లు చొప్పున నాలుగు రోజులు హల్‌చల్ చేసి బంగారం, వెండి వంటి వస్తువులను దొంగిలించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా తాళం వేసి ఉన్న క్వార్టర్లే లక్ష్యంగా దొంగతనాలు జరిగాయి. అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్‌ఐ ఎల్. శ్రీనివాసరావు సాక్షితో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.



- ఇంట్లో నగదు, బంగారం, వెండి వంటి వస్తువులు ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలి.
- తాళం వేసి బయట ప్రాంతాలకు వెళ్లేవారు స్టీల్‌ప్లాంట్ స్టేషన్ (ఫోన్ : 0891 –2587233)కు సమాచారం ఇస్తే ఆ ఇళ్ల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాటు చేస్తారు.
- అదే విధంగా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్) యాప్ ద్వారా ఇంటికి భద్రత కల్పిస్తారు.
- ఉక్కునగరంలోని హోంగార్డ్ సెల్‌కు (ఫోన్ : 79010 98366) ముందస్తు సమాచారం ఇవ్వాలి. తద్వారా ఎప్పటికప్పుడు ఆయా ఇళ్లను తనిఖీ చేస్తారు.

సమాచారమిస్తే భద్రత కల్పిస్తాం



పండక్కి ఊర్లో ప్రజలు తమ విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచకుండా, లాకర్‌లో భద్రపరుచుకోవాలి. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. ఇటీవల బైక్ దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున, వాటికి అలారం లాక్‌లు పెట్టుకోవాలి. ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లు వెళ్లేవారు ముందుగా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇస్తే నిఘా ఉంచుతాం. దీని కోసం ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ అందుబాటులో ఉంది. ఈ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే ఆ ఇంటికి భద్రత కల్పిస్తాం. ప్రధాన వీధుల్లో, జంక్షన్‌లలో విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ, వచ్చే పోయే వారిని వేధించే ఆకతాయిలపై కూడా సమాచారం ఇవ్వాలి. ఎవరూ భయపడాల్సిన పని లేదు, ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చు. మరిన్ని వివరాలకు 8331041605 నంబరులో సంప్రదించాలి. లేదంటే 100కు డయల్ చేయవచ్చు. – జీ.వి.ప్రసాద్, న్యూపోర్టు క్రైం ఎస్‌ఐ

యువజనోత్సవాల్లో సంక్రాంతి సందడి

- విజ్ఞాన్ యువతరంగ్‌లో ఉత్సాహంగా వేడుకలు
- ముగిసిన ఉత్సవాలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు నగదు పారితోషికం, జ్ఞాపికలను అందిస్తున్న సంస్థ చైర్మన్ రత్తయ్య



కళాశాల ఆవరణలో సంక్రాంతి సందడి

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన యువజనోత్సవాలు (విజ్ఞాన్ యువతరంగ్) గురువారం ముగిశాయి. రెండో రోజు కార్యక్రమం సంక్రాంతి సంబరాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. కళాశాలలో భోగి మంటలు, గొబ్బిళ్ల సందడి, డూడూ బసవన్నల విన్యాసాలు, గాలి పటాల పండగతో అంతటా పండగ వాతావరణం నెలకొంది. కొత్త కుండల్లో పొంగల్ తయారు చేశారు. ఎండుగడ్డి, కొబ్బరి ఆకులతో పూరిళ్లు నిర్మించి, పల్లె వాతావరణాన్ని తలపించేలా చేశారు. ముఖ్య అతిథులు లైఫ్ టీచర్ అండ్ ఫౌండేషన్ చైర్మన్ ఆచార్య అజిత్ కుమార్, విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ యువజనోత్సవాలు విద్యార్థుల ప్రతిభా పాటవాలకు పదునుపెట్టడానికి చక్కటి వేదిక అన్నారు. కార్యక్రమంలో భాగంగా సంక్రాంతి విశిష్టతను విద్యార్థులు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొని, సందడి చేశారు. వివిధ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, సీఈవో శ్రీకాంత్, విజ్ఞాన్ ఇంజినీరింగ్, ఫార్మా, మహిళా కళాశాలల ప్రిన్సిపాల్స్ బి.అరుంధతి, వై.శ్రీనివాసరావు, సుధాకర్, యువతరంగ్ కన్వీనర్ బి.సతీష్, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, కార్యక్రమ కో–ఆర్డినేటర్లు సుందర్ రామం, హిమబిందు, అరవింద్, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఫైనాన్స్ డైరెక్టర్‌కు 'సీ' అభినందనలు



వేణుగోపాలరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) వి.వి. వేణుగోపాలరావును ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు అభినందించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అక్కౌంట్స్ అఫ్ ఇండియా (ఐకాయ్) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 16 జాతీయ అవార్డుల ప్రదానం కార్యక్రమంలో లార్జ్ కార్పొరేట్, మ్యానుఫాక్చరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కేటగిరీలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చార్టర్డ్ అక్కౌంటెంట్ బిజినెస్ లీడర్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా సీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దీనిపై డైరెక్టర్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఈ అవార్డు ఉక్కు ఉద్యోగుల సమష్టి కృషిగా అభివర్ణించారు. కార్యక్రమంలో సీజీఎం యు. శ్రీధర్, సీ నాయకుడు జగదీశ్వరరావు, కోశాధికారి పి.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

భారత కీర్తి పతాక వివేకానంద

- దేశ ఔన్నత్యాన్ని విదేశాల్లో చాటిచెప్పిన మహనీయుడు
- జయంతి వేళ స్మరించుకున్న వక్తలు
- ఘనంగా జాతీయ యువజన దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న నాయకులు

అగనంపూడి: భారత దేశ కీర్తిపతాకం వివేకానందుడని సత్యసాయి బాల వికాస్ యూత్ కోఆర్డినేటర్ కె.సాయి సంపత్‌కుమార్ అన్నారు. మన దేశ సంస్కృతీ, సంప్రదాయాలను, ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాల్లో చాటిచెప్పిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. విశేష జ్ఞాన సంపదతో యువతకు మార్గదర్శకులుగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన అగనంపూడి దిబ్బపాలేనికి చెందిన చట్టి నరసింగరావు, సత్యసాయి బాలవికాస్ కో–ఆర్డినేటర్ సంపత్ కుమార్‌లను సత్కరించారు. ఉక్కు కార్మిక సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, విందుల వరహాలు, అగనంపూడి సత్యసాయి కో–ఆర్డినేటర్ విందుల పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

గాజువాక: స్థానిక మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ దీనంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులు వివేకానందుని బోధనలను ప్రచారం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు ప్రోత్సాహకాలను అందజేశారు. బౌద్ధిక్ ప్రముఖ్ కొండపల్లి రామారావు మాట్లాడుతూ వివేకానందుని బోధనలు ప్రతి ఒక్కరినీ విజయం వైపు నడిపిస్తాయన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు బడే సత్యనారాయణ, సీహెచ్.సత్య, శ్యామ్, ఎస్.రవి కుమార్, శ్రీనివాసరావు, డి.పావని పాల్గొన్నారు.

వివేకానందుడి బోధనలు అనుసరణీయం

పెదగంట్యాడ: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో యువజనోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువులోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో వివేకానందుని చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం వీహెచ్‌పీ ప్రతినిధి జీలకర్ర రమణ మాట్లాడుతూ వివేకానందుని బోధనలు అనుసరణీయమన్నారు. వాసుదేవ శర్మ, పిలక అప్పలరెడ్డి, జీలకర్ర నాగేశ్వరరావు, భువనేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు.

- నవ్య చేతన మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయకనగర్ వుడా కాలనీలో వివేకానందుని జయంతి ఉత్సవాలు నిర్వహించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. అండిబోయిన లక్ష్మి, ఎంవీవీ సత్యనారాయణ, అండిబోయిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు



బాలచెరువు శివాలయంలో వివేకానందునికి నివాళులర్పిస్తున్న రమణ తదితరులు

నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి



నాట్యగురువు సందీప్‌కుమార్‌తో చిన్నారులు

గాజువాక: సంక్రాంతి సంబరాల్లో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ సార్వత్రిక పరిషత్‌లో నిర్వహించిన నృత్య పోటీల్లో గాజువాకకు చెందిన కళారాధన అకాడమీ చిన్నారులు ప్రథమ బహుమతిని సాధించారు. వారు ప్రదర్శించిన శివతాండవం నృత్యానికి బహుమతితో పాటు 2023 టాలెంట్ అవార్డును ప్రముఖ నాట్యగురువు రాధేశ్యామ్ చేతుల మీదుగా అందుకున్నట్లు కళారాధన నాట్యగురువు తాళ్లపాక సందీప్‌కుమార్ తెలిపారు. బాల కళాకారులు అక్షయ, సాహితి, షణ్ముఖప్రియ, నివేదిత, మోనిషారెడ్డి, జస్మిత, నిహారిక తదితరులను అభినందించారు.

రేపు అప్పన్న ఆలయంలో గోదా కల్యాణం

సింహాచలం : భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గోదాకల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవోవి.త్రినాథరావు గురువారం తెలిపారు. ఆరోజు సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు కల్యాణం జరుగుతుందని, ఆరోజు ఉదయం 9.30గంటలకు నిర్వహించాల్సిన స్వామివారి నిత్యకల్యాణాన్ని గోదా కల్యాణంతో కలిపి నిర్వహిస్తామన్నారు. అలాగే ఈనెల 16న సాయంత్రం కొండదిగువ పూలతోటలో గజేంద్రమోక్షం ఉత్సవాన్ని కూడా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులంతా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాల్సిందిగా కోరారు. గజేంద్రమోక్షం సందర్భంగా 16వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సింహగిరిపై స్వామివారి మూలవిరాట్ దర్శనాలు లభిస్తాయని తెలిపారు.

సమస్యలు పరిష్కరించేందుకే 'గడప గడపకు..'

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: పారదర్శక పాలనను అందిస్తూ పేద ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని వడ్లపూడి కాలనీ సచివాలయం–2లో గల దుగ్గపువానిపాలెం, కాశీపాలెం, ఉప్పరవానిపాలెం, యాతపాలెం ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారన్నారు. సీఎం ఆదేశాల మేరకు మీ సమస్యలను పరిష్కరించేందుకు మీ ముంగిటకు వచ్చామని తెలిపారు. స్థానికులు తెలియజేసిన సమస్యలను, సంబంధిత అధికారులకు అక్కడే తెలియజేసి సత్వర పరిష్కార దిశగా సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 87వ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, ప్రగడ వేణుబాబు, ఎన్నేటి రమణ, దుగ్గపు దానప్పలు, కోమటి రమాదేవి, బొండా గోవిందరాజులు, ఈశ్వరరావు, కరణం లక్ష్మి, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 700వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 700వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన ట్రాఫిక్ మరియు పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షల్లో పాల్గొన్న సీహెచ్.నరసింగరావు మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. మహనీయుల ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటానికైన సిద్ధమన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు సాగిస్తామన్నారు. ఉక్కును కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని, కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ నెల 30న జరప తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనలో కార్మికులందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.ఆదినారాయణ, గంధం వెంకటరావు, అయోధ్యరామ్, కారునాయుడు, జె.రామకృష్ణ, మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప ఇతర కార్మికులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత తులసీరాం జట్టు



విజేత జట్లతో సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని 69వ వార్డు తుంగ్లాం ఎస్సీ కాలనీలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. గురువారం జరిగిన ఫైనల్ పోటీలో కణితి సింహాచలం జట్టుపై గెద్దం తులసీరామ్ జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. పెట్లి వెంకటేష్ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. బి.ఆర్.అంబేడ్కర్ యూత్ నాయకుడు గెద్దం శివ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు పెట్లి అర్జునరావు, కార్యదర్శి శ్రీను, ఈతలపాక మంగరాజు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు పెట్లి వెంకటరమణ, పెట్లి అప్పారావు, ఎలుసూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై కుట్టు మిషన్ల పంపిణీ



మహిళకు కుట్టుమిషన్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: లుపిన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ మహిళలకు 50శాతం రాయితీతో కుట్టుమిషన్లు అందించారు. ఫౌండేషన్ ద్వారా 90 రోజుల పాటు మహిళలకు ఉచిత శిక్షణనిచ్చిన అనంతరం వారికి రాయితీపై కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. నిర్వాసిత కాలనీలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ హెడ్ రాజేష్, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, లుపిన్ డీజీఎం శ్రీనివాసరావు, మేనేజర్ వెంకట నారాయణ, నాయకులు ఇల్లపు ప్రసాద్, నక్కా రమణబాబు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తత అవసరం



జాగ్రత్తలను వివరిస్తున్న గాజువాక క్రైం సీఐ సూర్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: తాళాలు వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసుకుని ఆగంతకులు దొంగతనాలకు పాల్పడుతున్నారని, కనుక పండగ సమయంలో ఊళ్లకు వెళ్లేవారు తప్పనిసరిగా తమకు సమాచారం ఇవ్వాలని గాజువాక క్రైం సీఐ టి.సూర్యనారాయణ సూచించారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో పండగ సమయాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై గ్రామస్తులకు గురువారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఫోన్లలో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. దీనివల్ల ఊళ్లకు వెళ్లేవారు తమ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లినా, ఇంటి సమాచారాన్ని యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొబైల్ దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నాయని క్రైం ఎస్‌ఐ వి.మహేశ్వరరావు అన్నారు. గ్రామంలో తాగుబోతుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులు, రాత్రి సమయాల్లో యువకులు రోడ్లపై ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వంటి పలు సమస్యలను గ్రామస్తులు సీఐ దృష్టికి తీసుకువచ్చారు. క్రైం హెచ్‌సీ వరహాలు, సచివాలయ మహిళాపోలీసు గాయత్రి, గ్రామ నాయకులు సంగ్రాన అంజి, గొంతిన శ్రీనివాసరావు, నర్సింగరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ స్కీమ్‌లో నగదు జమకు వినతి

ఉక్కునగరం: ఆర్‌ఐఎన్‌ఎల్ ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ (రెప్స్)లో యాజమాన్యం వెంటనే నగదు జమ చేయాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు కోరారు. ఈ మేరకు సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్ సీఎండీకి గురువారం లేఖ అందజేశారు. రెప్స్ ప్రకారం యాజమాన్యం అధికారులకు 2007 నుంచి, కార్మికులకు 2012 నుంచి లాభ, నష్టాలను బట్టి పెన్షన్ స్కీమ్‌కు నగదు జమ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. యాజమాన్యం ఫండ్‌కు మొత్తం రూ. 474 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.159.95 కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. మిగిలిన రూ. 313.95 కోట్లు పెన్షన్ ఫండ్‌కు జమ చేయాల్సి ఉందని, వెంటనే దానిని జమ చేయాలని కోరారు.



క్షేమంగా వెళ్లి లాభంగా రండి

దువ్వాడ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు వినూత్నంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ట్రాఫిక్ సీఐ జి.ఉమామహేశ్వరరావు, ఎస్‌ఐ మహాలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది టోల్‌గేటు వద్ద గురువారం సంక్రాంతికి సొంత ఊళ్లకు వెళ్తున్న వాహనదారులకు గులాబీ పువ్వులు అందించి, రహదారి నిబంధనలు పాటించడం ద్వారా క్షేమంగా వెళ్లి లాభంగా రావాలంటూ ఆకాంక్షించారు. ట్రాఫిక్ పోలీసుల అభినందనలకు వాహనదారులు ఫిదా అయ్యారు. – ఉక్కునగరం